

ప్లాస్టిక్ నిషేధం ఎక్కడ?
ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకు పెరుగుతూనే ఉంది. ప్రభుత్వం ఎన్ని నిబంధనలు విధించినా నిషేధం కానరావడంలేదు. 8లో▸



విజయం సాధిస్తాం
ముఖ్యమంత్రి కేసీఆర్ ఎదురులేని నేత అని, జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లో విజయం తమదేనని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. 8లో▸



'కంటివెలుగు'కు కాసుల్లేవ్ !
ప్రభుత్వం నిర్వహిస్తున్న 'కంటి వెలుగు' శిబిరాలకు నిధులు లేకపోవడంతో పలు చోట్ల తూతూ మంత్రంగా సాగుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



జస్టిస్ సుదర్శన్ చాంబర్‌లో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ తదితరులు

అనంతగిరి: కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నారాయణ్‌రెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సుదర్శన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఆయన కోర్టు ఆవరణలోని న్యాయమూర్తి కార్యాలయానికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్, జూనియర్ జడ్జి శ్రీకాంత్, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తదితరులు ఉన్నారు.

'మోడల్'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పూడూరు: మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్కేపల్లి పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి పదో తరగతుల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బోనోఫైడ్, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

లోక్ అదాలత్‌పై సమీక్ష

- పోలీసు అధికారులు, పీపీలతో చర్చించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి
- 11న నిర్వహించే అదాలత్‌లో మెజార్టీ కేసుల్లో రాజీ కుదుర్చాలని సూచన



పీపీలు, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా జడ్జి సుదర్శన్


అనంతగిరి: వికారాబాద్‌లోని కోర్టు ఆవరణలో ఈనెల 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సుదర్శన్ అన్నారు. ఈ మేరకు గురువారం వికారాబాద్ కోర్టు ఆవరణలో పోలీసు అధికారులు, పీపీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. క్షణికావేశంలో, తెలిసీతెలియక చేసిన తప్పుల కారణంగా కేసుల్లో ఇరుక్కున్న వారు తమ తప్పును ఒప్పుకొన్నట్లయితే ఫైన్ కట్టించి కేసులు కొట్టేస్తామన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ కుదిరితే ఇరు వర్గాలు గెలిచినట్లేనని తెలిపారు. జిల్లాలో అధిక సంఖ్యలో కక్షిదారులు రాజీపడే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయమూర్తి డీబీ శీతల్, జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, ఏఎస్పీ ఎంఏ.రషీద్, పీపీలు డీఎస్పీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సులో మహిళలకు ఉచిత శిక్షణ

షాద్‌నగర్‌రూరల్: మొయినాబాద్ మండలం చిలుకూరులోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో మహిళలకు కంప్యూటర్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా మేనేజర్ శైలకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి ఉండాలన్నారు.కంప్యూటర్ కోర్సు శిక్షణ కాలం నాలుగు నెలలు మాత్రమే ఉంటుందని, ఉచిత భోజన వసతి కల్పించనున్నట్లు చెప్పారు. శిక్షణ తీసుకునేవారు కనీసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని, ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, ఇంటర్, పదో తరగతి పాసైన సర్టిఫికెట్‌లు (జిరాక్స్), కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రం,6 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 76600 22523, 7660022524 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

మెరుగైన పాలన అందిస్తాం

- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం
- ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలి
- జిల్లా ఆరో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నారాయణ్‌రెడ్డి
- స్వాగతం పలికిన అడిషనల్ కలెక్టర్, అధికారులు



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణ్‌రెడ్డి

వికారాబాద్: అర్హులందికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని కొత్త కలెక్టర్ నారాయణ్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ కలెక్టర్‌గా పనిచేసిన ఆయన.. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా వికారాబాద్‌కు వచ్చిన విషయం తెలిసిందే. కలెక్టర్ నిఖిల గురువారం విధుల నుంచి రిలీవ్ కాగా.. జిల్లా ఆరో కలెక్టర్‌గా నారాయణ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఆర్‌ఓ అశోక్‌కుమార్, వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారి, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్డీఓ కృష్ణన్, ఇతర శాఖల జిల్లా అధికారులు కోటాజీ, సుభాషిణి, రేణుకాదేవి, గోపాల్, విమల, రాజేశ్ తదితరులు నూతన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. తొలి సంతకం చేసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పక్కాగా అమలు చేస్తామని తెలిపారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నాయకుల సహకారంతో వచ్చే ఎన్నికలను సజావుగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని స్పష్టంచేశారు. పాలనలో ప్రతిఒక్కరూ యంత్రాంగానికి సహకరించాలని కోరారు. త్వరలోనే జిల్లా అంతటా పర్యటించి, ఇక్కడి పరిస్థితులు, ప్రజల అవసరాలను తెలుసుకుంటామన్నారు. మెరుగైన సేవలు అందించేందుకు తనవంతు బాధ్యతలు నిర్వహిస్తానని వెల్లడించారు.






కలెక్టర్‌ను సన్మానించిన అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఆర్‌ఓ అశోక్ కుమార్

ఖజానాకు సంకెళ్లు!

చేసిన పనులకు బిల్లులు రాక సర్పంచ్‌ల అవస్థలు

- వడ్డీలు కట్టలేకపోతున్నామని ఆవేదన
- బకాయిల కోసం ఎస్టీఓల చుట్టూ తిరుగుతున్న కాంట్రాక్టర్లు
- ఒక్కో జీపీలో రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు పెండింగ్



వికారాబాద్: పూర్తి చేసిన పనులకు సంబంధించిన బిల్లులు నెలలు, ఏళ్ల తరబడి రాకపోవడంతో సర్పంచ్‌లు విలవిల్లాడుతున్నారు. సాధారణ బిల్లులు మూడు నుంచి నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉండగా సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు చెందినవి ఏడాది కాలంగా క్లియర్ కావడం లేదు. దీంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ప్రజాప్రతినిధులు నెత్తీనోరు కొట్టుకుంటున్నారు. ఒక్కో పంచాయతీ పరిధిలో రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

ఎవరి నోట విన్నా ఫ్రీజింగ్..

ఎస్టీఓ పేరెత్తితే చాలు.. ప్రస్తుతం ఎవరి నోట విన్నా ఫ్రీజింగ్ మాటే వినిపిస్తోంది. గతంలో ఫ్రీజింగ్ అనే మాటకు అర్థం తెలియని వారందరికీ ప్రస్తుతం ఈ పదం సుపరిచితమైంది. ఫ్రీజింగ్ అంటే ట్రెజరీకి వెళ్లిన బిల్లులకు డబ్బులు రావు అని ప్రతిఒక్కరికీ అర్థమవుతోంది. ప్రస్తుత ట్రెజరీలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయనడానికి ఇదే పెద్ద ఉదాహరణ. ఫ్రీజింగ్ కారణంగా పనులు చేసి కూడా ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొందని ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వేతనాలు తదితర చిన్నచిన్న బిల్లులు మినహా మిగతా బిల్లులు పాసవడం లేదు.

డబ్బులు రావట్లే..

బిల్లులు చేసి పంపిన తర్వాత కనీసం మూడు నెలలు గడిస్తే కానీ బిల్లులు పాసవుతున్న దాఖలాలు లేవని, వెబ్‌సైట్‌లోకి వెళ్లి చూస్తే వెయిటింగ్ ఫర్ గవర్నమెంట్ అప్రూవల్ అని చూపిస్తోందని సర్పంచ్‌లు పేర్కొంటున్నారు. ఆయా పనులకు సంబంధించిన బిల్లులు కుప్పలుతెప్పలుగా పేరుకుపోతున్నాయి. అయితే కొన్ని సందర్భాల్లో ఎస్టీఓలపై ఒత్తిడి లేకుండా బిల్లులు చేసి, అప్‌లోడ్ చేస్తున్నారు. దీంతో తమ వద్ద బిల్లులేవీ పెండింగ్ లేవని చేతులు దులిపేసుకుంటున్నారు. బిల్లులు చేసినా బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా కావటంలేదు. ఆయా ఇంజనీరింగ్ శాఖలకు సంబంధించిన ఆఫీసర్లు, ఎస్టీఓ అధికారులు తమ పర్సెంటేజీలు తీసుకుంటున్నా.. బిల్లులు రాకపోవటంతో ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

మెజార్టీ బిల్లులదీ అదే పరిస్థితి...

ఒకటా.. రెండా.. మెజార్టీ బిల్లులదీ ఇదే పరిస్థితి. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి, జీపీ జనరల్, స్టేట్ ఫైనాన్స్ తదితర అన్ని రకాల బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లోనే ఉంటున్నాయి. దీంతో సొంత డబ్బులు ఖర్చు చేసి, పనులు చేసిన వారు చెప్పులరిగేలా ఎస్టీఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ట్రాక్టర్లు, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ, సీసీ రోడ్లు, మధ్యాహ్న భోజనం, హాస్టళ్ల బకాయిలు, జీపీఎఫ్ లోన్లు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు,ఇలా అన్ని రకాల బిల్లులు నెలల తరబడి మగ్గుతున్నాయి. కాగా ఇప్పటికే వందల సంఖ్యలో చెక్కులు, బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు, కాంట్రాక్టర్లు ప్రభుత్వ తీరుపై నేరుగా విమర్శలు చేస్తుండగా.. అధికార పార్టీ నేతలు మాత్రం అంతర్గతంగా అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్రీజింగ్ ఎత్తివేయాలి

సర్పంచులు, ఎంపీటీసీలకు వస్తున్న నిధులే తక్కువ. వచ్చిన అరకొర ఫండ్స్‌తో పనులు చేస్తే ఆ బిల్లులు కూడా సకాలంలో రావటంలేదు.. అప్పులు చేసి పనులు చేస్తున్న ప్రజా ప్రతినిధులు వాటికి మిత్తీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఫ్రీజింగ్‌ను ఎత్తివేయాలి. సకాలంలో బిల్లులు అందక చాలా మంది సర్పంచ్‌లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్మికుల వేతనాలకూ కష్టమవుతోంది.

– యాదయ్య, సర్పంచ్, దోర్నాల్‌పల్లి

ఈ- రేస్..

భారత్‌దే భవిష్యత్

ఇక్కడ నైపుణ్యమున్న రేసర్లకు కొదవలేదు

- రానున్న కాలం ఎలక్ట్రానిక్ వాహనాలదే
- ఫార్ములా–1 నుంచి ఫార్ములా–ఈ వైపు ఆసక్తి
- మహీంద్రా రేసింగ్‌తో మంచి ఫలితాలు
- 'సాక్షి'తో బ్రెజీలియన్ రేసర్ 'లుకాస్ డి గ్రాసీ'



సాక్షి, సిటీబ్యూరో: మరికొద్ది రోజుల్లో భాగ్యనగరం వేదికగా దేశంలోనే మొదటిసారిగా తలపెట్టిన ఫార్ములా ఈ –రేసింగ్ చాంపియన్‌షిప్‌లో అంతర్జాతీయ రేసర్లు పాల్గొనున్నారు. ఇందులో భాగంగా మహీంద్రా రేసింగ్ తరపున ప్రముఖ బ్రెజీలియన్ ఫార్ములా రేసర్ 'లుకాస్ డి గ్రాసీ' హైదరాబాద్‌కు వచ్చారు. లుకాస్ 2014లో బీజింగ్ ఈ–ప్రిక్స్‌లో మొట్టమొదటి ఫార్ములా ఈ- రేస్‌ను గెలిచారు. 101 రేసులు, 40 పోడియంలు, 13 విజయాలతో ప్రపంచవ్యాప్తంగా అత్యంత విజయవంతమైన ఫార్ములా డ్రైవర్లలో ఒకరుగా నిలిచారు. సియోల్ వేదికగా 100 రేసుల మార్క్‌ను చేరుకున్న మొట్టమొదటి రేసర్‌గా చరిత్ర సృష్టించారు. ఫార్ములా ఈ- ప్రస్థానంలో మూడో తరంగా ప్రత్యేకతగాంచిన జెన్- 3లో తన సామర్థ్యాన్ని మరోసారి నిరూపించుకోవడానికి మహీంద్రా రేసింగ్‌తో కలిసి పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో 'లుకాస్ డి గ్రాసీ' ఫార్ములా ఈ- ప్రిక్స్ గురించి లుకాస్ వివరించారు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే..

మంచి పరిణామం

భౌగోళికంగా, ఆర్థిక వ్యవస్థ, జనాభా తదితర అంశాల్లో ఎంతో దృఢమైన దేశం భారత్. ఇలాంటి అత్యంత సామర్థ్యవంతమైన వేదికపై ఫార్ములా ఈ- రేసింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్ నిర్వహించడం మంచి పరిణామం. గ్లోబల్ మార్కెట్‌ను ప్రభావితం చేయడంలో భారత్ ప్రధానమైనది. ఈ- ఫార్ములా, ఈ- చాంపియన్‌షిప్‌లో గట్టి పోటీ ఉంటుందని భావిస్తున్నాను. ఇక్కడ మంచి నైపుణ్యమున్న రేసింగ్ ఔత్సాహికులు ఉన్నారు. భారత్ రేసర్లకు ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్‌లో ఫార్ములా ఈ- చాంపియన్‌షిప్‌లో ఈ దేశం ప్రత్యేకతను సంతరించుకునే అవకాశముంది.

ఎక్కువ మంది ఆసక్తి..

ప్రస్తుతం ఫార్ములా–1 నుంచి ఫార్ములా–ఈలోకి ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. ఫార్ములా–ఈ రేసింగ్ మిగతా విభాగాలకంటే భిన్నంగా ఉంటుంది. ఫార్ములా–ఈలో అత్యధిక వేగంతో, తక్కువ బరువుతో అధునాతన సాంకేతిక పరిణామాలు చోటుచేసుకున్నాయి. గతంలో రేసింగ్ కార్ల తయారీ వాటి సామర్థ్యం రేసింగ్ అనుకూలతలు ఫార్ములా–ఈతో సరితూగ లేవు. ముఖ్యంగా జెన్3 కార్లు 600 కిలో వాట్స్ చార్జింగ్ సామర్థ్యంతో గంటకు 300 కిలో మీటర్ల వేగంతో దూసుకుపోతున్నాయి.

ఆరోగ్యకర ఆహారం..

వ్యక్తిగతంగా హైదరాబాద్ రేస్ వీక్‌లో పాల్గొనడానికి అన్ని విధాలుగా సంసిద్ధంగా ఉన్నాను. భారత్‌కు రావడం ఇది మూడోసారి. భారత్ వేదికగా ఆహారంలో జాగ్రత్త వహించాలని నిర్ణయించుకున్నాను. ఆరోగ్యకరమైన ఆహారం, కూరగాయలు, మాంసం, కార్బొహైడ్రేట్లు తీసుకుంటాను. భారత్, బ్రెజిల్, మెక్సికో వంటి దేశాల్లో ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. జంక్ ఫుడ్‌ను నివారిస్తే ఫుడ్ ఇన్‌ఫెక్షన్లకు దూరంగా ఉండొచ్చు. ఇంధన సంరక్షణ కోసం 2007లో నా స్వచ్ఛంద సంస్థ 'స్మార్టర్ డ్రైవింగ్'ను ప్రారంభించాను. అయిదేళ్ల పాటు సంస్థ తరపున పలు కార్యక్రమాలను నిర్వహించాను. అంతేకాకుండా పలు ఎన్‌జీఓలతో కలిసి పని చేశాను. నా విజయ ప్రస్థానంలో మా అమ్మ ప్రోత్సాహం కీలకమైంది.

భారత్‌లో ఎలక్ట్రిక్ టెక్నాలజీ భేష్..

భారత్‌లోఎలక్ట్రిక్ టెక్నాలజీ, మొబిలిటీ అద్భుతంగా కొనసాగుతోంది. ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, కార్ల వినియోగం, ఉత్పత్తి అధికంగా ఉంది. ఈ రంగాన్ని అగ్రగామిగా మార్చడానికి భారత్‌లో మహీంద్రా వంటి సంస్థలు విశేష కృషి చేస్తున్నాయి. భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాలకే ప్రాధాన్యం పెరగనుంది. మహీంద్రాతో కలిసి నా ప్రయాణం అద్భుతంగా సాగుతోంది. మెక్సికో వేదికగా మొదటి సీజన్ రేస్‌లో 3వ స్థానంతో పూర్తి చేశాం. ప్రస్తుతం భారత్‌లో జరగనున్న ఫార్ములా–ఈ రేసింగ్‌తో పాటు రియాద్‌లో జరిగే రేస్ ఈవెంట్లలో మరింత మంచి ప్రదర్శన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను.



మోమిన్‌పేటలో పీఏసీఎస్ నూతన భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

సొసైటీలతో మెరుగైన సేవలు

- రైతు అభ్యున్నతే సీఎం కేసీఆర్ ధ్యేయం
- ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్
- మోమిన్‌పేట పీఏసీఎస్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

మోమిన్‌పేట: రైతులకు ఉత్తమ సేవలు అందించడమే ధ్యేయంగా కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. రూ.1.69 కోట్ల నాబార్డు నిధులతో మండల కేంద్రంలో చేపట్టిన పీఏసీఎస్ నూతన కార్యాలయం, గోదాం నిర్మాణానికి చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సొసైటీల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సరసమైన ధరలకు అందిస్తున్నామని తెలిపారు. పంటలకు మద్దతు ధర అందిస్తూ చేయూతనిస్తున్నామని స్పష్టంచేశారు. స్వల్పకాలిక పంట రుణాలు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను అభివృద్ధి చేయడంతో పాటు దీర్ఘకాలిక రుణాలతో వ్యవసాయ, అనుబంధ రంగాలకు ఊతమిస్తున్నామని చెప్పారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి, సొసైటీల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, డైరెక్టర్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ చంద్రయ్య, బ్యాంకు మేనేజర్ నారాయణరెడ్డి, కో ఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ అజమత్, సీఈఓ శేఖర్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరిశంకర్, ఆలయ కమిటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు

తొలిసారిగా ఆన్‌లైన్‌లో దర్శన టికెట్లు

కీసర: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 16 నుంచి 21 వరకు కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం కీసరగుట్ట లోని కల్యాణ మండపంలో వివిధ శాఖల అధికారులతో జరిపిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈసారి స్వామివారి దర్శనం నిమిత్తం భక్తులు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకునేందుకు తొలి సారిగా వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీంతోపాటు వివిధ ఆర్జిత సేవలను కుడా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చన్నారు. ఈసారి ఎలాంటి వీఐపీ, వీవీఐపీ పాసులు మంజూరు చేయడం లేదన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహా రెడ్డి, అభిషేక్ అగస్త్య, ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ, జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేశ్, సర్పంచ్ నాయకపు మాధురి ఈఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీల్లో కొత్త కోర్సులు

- పేద విద్యార్థులకు ఉచితంగా ఖరీదైన సాంకేతిక విద్య
- డాక్టర్ డీఎస్ఆర్ రాజేందర్ సింగ్



కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మాట్లాడుతున్న డాక్టర్ రాజేందర్ సింగ్

కొడంగల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో రాష్ట్ర వ్యాప్తంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టి, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలంగాణ కళాశాల ఉన్నత విద్యా విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డీఎస్ఆర్ రాజేందర్‌సింగ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 132 గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలు ఉన్నాయని తెలిపారు. ఇందులో 11 కాలేజీలు స్వయం ప్రతిపత్తి కలిగి ఉన్నాయన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 50 రకాల కాంబినేషన్ కోర్సులు ప్రవేశపెట్టామని స్పష్టంచేశారు. ఐదేళ్లుగా ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ సారథ్యంలో ప్రభుత్వ విద్య బలోపేతమైందని వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో యాభై వేల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారని వెల్లడించారు. డిగ్రీలో టెక్నాలజీ, సెరీకల్చర్, మైక్రో బయాలజీ, బీఎస్సీ కంప్యూటర్, బీకాం కంప్యూటర్, బీబీఏ గేమింగ్, బీఎస్సీ హానర్స్, మిషన్ లర్నింగ్, డాటా సైన్స్ తదితర ఉన్నతమైన కోర్సులు ప్రవేశపెట్టి గ్రామీణ విద్యార్థులకు ఉచితంగా మెరుగైన విద్య అందిస్తున్నామని చెప్పారు. సంపాదించు, చదువు (ఎర్నింగ్ బై లర్నింగ్) ప్రాతిపదికన రాష్ట్రంలోని నాలుగు కళాశాలల్లో ప్రయోగాత్మకంగా వినూత్న విద్యను ప్రవేశపెడుతున్నామని వెల్లడించారు. ఇందుకోసం 52 ప్రముఖ కంపెనీలతో సంప్రదింపులు జరిపామని చెప్పారు. హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్‌లోని నాలుగు కాలేజీలకు ఈ అవకాశం కల్పించినట్లు చెప్పారు.

బీఆర్‌ఎస్‌ను సాగనంపుదాం

- రాష్ట్రంలో ఆపార్టీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదు
- మాజీ ఎంపీలు విశ్వేశ్వర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి
- తాండూరులో బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

తాండూరు: బీఆర్‌ఎస్‌ను సాగనంపడం బీజేపీతోనే సాధ్యమని మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి అన్నారు. తాండూరు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రపంచంలోనే భారత దేశం ఆర్థికంగా ఎదుగుతున్న జాబితాలో ఉందన్నారు. కేవలం ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమైందని తెలిపారు. ఇంగ్లాండ్ వంటి దేశం సైతం ఆర్థికంగా వెనుకబడిందని తెలిపారు. ప్రపంచ దేశాల్లో ఇండియా ఖ్యాతిని పెంచిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. దేశంలో సిద్ధాంతాలపై నడిచే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని స్పష్టంచేశారు. రాష్ట్రంలో 35 వేల బూత్ కమిటీలు ఏర్పాటు చేశామని, వీటిలో 7.70 లక్షల మంది కార్యకర్తలు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. గతంలో తెలంగాణ ఏర్పాటు కోసం టీఆర్‌ఎస్‌లో కొనసాగామని, ఆతర్వాత పార్టీలో అధికారం సీఎం కేసీఆర్, ఆయన కొడుకు, అల్లుడు, కూతురుకే పరిమితమైందని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, కార్యదర్శి యు.రమేశ్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు సాహు శ్రీలత, అంతారం లలిత, లావణ్య, బాలప్ప, నరేష్‌మహరాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు కిరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాద్‌రావు, నాయకులు పాండుగౌడ్, వెంకటయ్యగౌడ్, సందీప్, ఆంజనేయులు, మహిపాల్, గంగాధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగులకు పెన్షన్ విడుదల చేయండి


అతిథి గృహం వద్ద బీవీహెచ్‌పీఎస్ నాయకులు

వికారాబాద్ అర్బన్: దివ్యాంగులకు జనవరి నెల పెన్షన్ విడుదల చేయాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి (బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింహులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బీవీహెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి కొనసాగుతున్నా జనవరి పెన్షన్ డబ్బులు రాలేదన్నారు. వంద శాతం అంగవైకల్యం ఉన్న దివ్యాంగులు కేవలం ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ మీదనే ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపారు. నెలనెలా పెన్షన్ ఇవ్వక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. రెండు రోజుల్లో ప్రభుత్వం పెన్షన్లు విడుదల చేయకుంటే ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బీవీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

'బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలి'

అనంతగిరి: బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి అన్నారు. వికారాబాద్‌లో జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాంగ్వేజ్ పండిట్స్ ఉద్యమానికి టీటీయూ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచే సీనియారిటీ లిస్టు రూపొందించడానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. 317 జీవోతో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను భవిష్యత్తులో వారి సొంత జిల్లాకు వచ్చే విధంగా ప్రత్యేకమైన జీవోను ఇచ్చి న్యాయం చేయాలన్నారు. సీఎం ప్రకటించిన 10వేల పోస్టులను కూడా ప్రస్తుత పదోన్నతులోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కరణం దత్తాత్రేయరావు, కార్యదర్శి ప్రభాకర్, భోగేషన్, వేణుగోపాల్, బల్వంత్ రెడ్డి, రాములు, లక్ష్మయ్య, మల్లేశం, మోహన్, గోపాల్, బాబయ్య, సుధాకర్‌రెడ్డి, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.


జేఎన్టీయూ ఇంజనీర్ కాలేజ్ సుల్తాన్‌పూర్ జట్టు


మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల జట్టు

ఉల్లాసంగా..ఉత్సాహంగా..

రసవత్తరంగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారంలోని బాబు రావు సాగర్ క్రికెట్ మైదానంలో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సాక్షి ప్రీమియర్ లీగ్–4 (ఎస్‌పీఎల్)' క్రికెట్ మ్యాచ్‌లు గురువారం ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాయి. గ్రేటర్ హైదరాబాద్ నుంచి 65 జట్లు లీగ్‌లో పాల్గొంటున్నాయి.

విజేతల వివరాలు...

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం–1

- మొదటి మ్యాచ్‌లో ఏవీఎన్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 74 పరుగులు సాధించగా ప్రత్యర్థి మల్లారెడ్డి కళాశాల జట్టు 6.4 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 75 పరుగులు చేసి విజయం సాధించింది. మల్లారెడ్డి కళాశాల జట్టు క్రీడాకారుడు షిరిడీనాథ్ 25 బంతుల్లో 51 పరుగులు చేయగా, బౌలర్ మనీశ్ మూడు వికెట్లు తీసి విజయంలో కీలకపాత్ర పోషించారు.
- రెండవ మ్యాచ్‌లో శ్రీ ఇందూ ఇంజినీరింగ్ కళాశాల–ఎ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేయగా..అనంతరం బ్యాటింగ్ చేసిన మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల–బి జట్టు 81 పరుగులు చేసి పరాజయం పాలయింది. శ్రీ ఇందు కళాశాల జట్టు క్రీడాకారుడు శివ 31 బంతులో 58 పరుగులు చేయగా, వంశీ మూడు వికెట్లు తీశాడు.
- మూడవ మ్యాచ్‌లో శ్రీ ఇందూ ఇంజనీరింగ్ కళాశాల–బి జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సీఎంఆర్‌ఐటీ–బి జట్టు 95 పరుగులు చేయడంతో శ్రీ ఇందు కళాశాల జట్టును విజయం వరించింది.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం–2

- మొదటి మ్యాచ్‌లో మర్రి లక్ష్మారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 105 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన భారత్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 5 వికెట్లు కోల్పోయి 45 పరుగులు చేయడంతో మర్రి లక్ష్మారెడ్డి జట్టు గెలుపొందింది.
- రెండో మ్యాచ్‌లో మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల–ఎ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన వెస్లీ డిగ్రీ కళాశాల–బి జట్టు 10 ఓవర్లలో 74 పరుగులు చేసి ఓడిపోయింది.
- మూడవ మ్యాచ్‌లో శ్రీ ఇందూ ఫార్మసీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేయగా..అనంతరం బ్యాటింగ్ చేసిన సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల–సి జట్టు 8.5 ఓవర్లతో 3 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసి విజయం సాధించింది.
- నాలుగో మ్యాచ్‌లో జేఎన్టీయూ సుల్తాన్‌పూర్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 92 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన నల్ల నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 76 పరుగులు చేసి పరాజయం పాలైంది.

మనిషికి కంటి చూపు ముఖ్యం

- కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి
- ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి


తండాలో గిరిజన మహిళకు కంటి అద్దాలు ఇస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: మనిషి జీవితానికి కంటి చూపు చాలా ముఖ్యమని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ తండాలో ఆయన పర్యటించారు. తండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కంటి సమస్యలు ఉన్న వారితో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. అనంతరం కొడంగల్‌లో ఆర్‌ఎంపీ డాక్టర్ల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈద్గా సమీపంలో ప్రహరీ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పోరాట ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ఎంతో మందికి మేలు జరుగుతోందన్నారు. నియోజకవర్గంలోని అన్ని సామాజిక వర్గాలకు భవనాలను మంజూరు చేసినట్లు చెప్పారు. వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మధుయాదవ్, శంకర్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సర్పంచులు సయ్యద్ అంజద్, చాంద్‌పాషు, నాయకులు సలీం, గుల్షన్, గౌసన్, దాసప్ప యాదవ్, ఏకే యూసూఫ్, డాక్టర్ నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

ధనికులను చేసేందుకే దళితబంధు

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి


దళితబంధు కింద మంజూరైనా పౌల్ట్రీ ఫాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

దోమ: దళితులను ధనికులను చేసేందుకు దళితబంధు పథకం అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మల్లేపల్లిలో గ్రామానికి చెందిన దొడ్ల పేద్ద నర్సింహులుకు దళితబంధు కింద పౌల్ట్రీ ఫాం మంజూరైంది. ఈ మేరకు జెడ్పీటీసీ నాగిరెడ్డితో కలిసి గురువారం పౌల్ట్రీ ఫాంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి కోసమే దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి గ్రామంలో దళితబంధు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దొడ్ల అంజిలయ్య, వైస్ ఎంపీపీ మల్లేశం, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు , పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జిల్లా అధికారులు


కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న జెడ్పీ సీఈఓ, డీపీఓ, డీఆర్‌డీఓ, ఇతర అధికారులు

అనంతగిరి: నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నారాయణ్‌రెడ్డిని గురువారం జెడ్పీ, పంచాయతీ అధికారులు తమ సిబ్బందితో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుభాషిణి, డీపీఓ తరుణ్‌కుమార్, డీఆర్‌డీఓ కృష్ణన్, ఎంపీడీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్తయ్య, ఆయా మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు తదితరులు ఉన్నారు.

అభినందనల వెల్లువ

వికారాబాద్ అర్బన్: నూతన కలెక్టర్‌ను మున్సిపల్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కమిషనర్ శరత్ చంద్ర ఆధ్వర్యంలో పలువురు అధికారులు కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. అనంతపద్మనాభ స్వామి చిత్రపటాన్ని కలెక్టర్‌కు అందించారు. అనంతరం కమిషనర్ మున్సిపాలిటీ గురించి కూలంకుశంగా వివరించారు. ఈ సందర్భంగా డీఈ రాంకిషన్, టీపీఓ శ్రీధర్, ఏఈ బీమా రాయుడు, ఆర్‌ఓ శివ, మెప్మా టీఎంసీ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ నిషేధం ఎక్కడ?

యథేచ్ఛగా వినియోగం

- నిబంధనలు బేఖాతర్
- ఊరూరా పెరిగిపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- దృష్టిసారించని అధికారులు


పరిగిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

పరిగి: ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకు పెరుగుతూనే ఉంది. ప్రభుత్వం ఎన్ని నిబంధనలు తీసుకువచ్చినా నిషేధం కానరావడంలేదు. ప్రమాణాలకు లోబడి తయారు చేసిన ప్లాస్టిక్‌ను మాత్రమే వినియోగించాలని సూచించినప్పటికీ ఎక్కడా అమలు కావడం లేదు. మరోవైపు ప్లాస్టిక్‌ను శాశ్వతంగా నిషేధించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపార సంస్థలు, గృహాల నుంచి రోజుకు 8 మెట్రిక్ టన్నుల వరకు చెత్త సేకరణ జరుగుతోంది. చెత్త సేకరణలో ప్లాస్టిక్‌ను ఏమేరకు వినియోగిస్తున్నారో తెలిసిపోతోంది. ఇంతలా ప్లాస్టిక్ వినియోగిస్తున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నాయకుల ఒత్తిళ్లు

ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై ఉమ్మడి రాష్ట్రంలోనే జీవోను తీసుకువచ్చారు. అప్పట్లో అధికారులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడం వల్ల కలిగే నష్టాలపై, అనర్థాలపై అవగాహన, ర్యాలీలు నిర్వహించారు. మున్సిపాలిటీల్లోని పారిశుద్ధ్య విభాగం అధికారులు ఆకస్మిక దాడులు చేసి వ్యాపారులకు జరిమానాలు విధించారు. తరువాత ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్టు మళ్లీ జీవోను తీసుకువచ్చారు. మున్సిపాలిటీలో ప్లాస్టిక్‌ను వినియోగించినా, అమ్మినా జరిమానాలు విధించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో మున్సిపాలిటీల్లోని ప్లాస్టిక్ వస్తువులు అమ్ముతున్న వారి దుకాణాలపై దాడులు నిర్వహించారు. అంతేకాక జరిమానాలు సైతం విధిస్తున్నారు. కానీ రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో అధికారులు నామమాత్రపు దాడులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్లాస్టిక్ వినియోగిస్తున్నా చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిషేధంపై ప్రత్యేక కార్యాచరణ

ప్లాస్టిక్ వినియోగానికి చెక్ పెట్టేందుకు దశలవారీగా నిషేధించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. పట్టణాల్లో, గ్రామాల్లో 50 మైక్రాన్‌ల కన్న తక్కువ పరిమాణం ఉన్న ప్లాస్టిక్‌ను అమ్మరాదని సూచించింది. ఆ తరువత 75 మైక్రాన్ల కన్న తక్కువ ఉన్న ప్లాస్టిక్‌ను అమ్మడం, వినియోగించడం చేయరాదని ఆదేశించింది. గత ఏడాది 75 నుంచి 125 మైక్రాన్ల కన్న తక్కువ ఉన్న ప్లాస్టిక్‌ను వినియోగించరాదని ప్రభుత్వం నిబంధనలు తీసుకువచ్చింది. దశలవారీగా ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు ప్రభుత్వం నిత్యం మైక్రాన్ల సైజ్‌ను పెంచుతూ పోతుంది. కానీ ప్లాస్టిక్ నిషేధం అనేది కాగితాల్లోనే కనిపిస్తోందని, క్షేత్రస్థాయిలో యథావిధిగా వినియోగిస్తున్నారని, ఇందుకు అధికారుల తీరే కారణమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


దుకాణంలో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు (ఫైల్)

విక్రయిస్తే కఠిన చర్యలు



ప్రభుత్వ నిబంధనల ప్రకారం 125 మైక్రాన్ల కన్న ఎక్కువ ఉన్న ప్లాస్టిక్‌ను వ్యాపారస్తులు విక్రయించాలి. అంతకన్న తక్కువ ఉంటే వ్యాపారస్తులపై కఠిన చర్యలు తీసుకుంటాం. పట్టణంలో నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ, హెచ్చరికలు జారీచేస్తున్నాం. నిబంధనలను ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తాం.

– శ్రీనివాసన్, మున్సిపల్ కమిషనర్ పరిగి

క్రీడల్లోనూ రాణించాలి

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్


క్రికెట్ టోర్నీ విన్నర్ జట్టుకు బహుమతి, నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

మర్పల్లి: చదువుతోపాటు క్రీడలు అవసరమని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మండల కేంద్రంలో పక్షం రోజులుగా నిర్వహించిన పీఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఈ పోటీల్లో ఆయా గ్రామాలకు చెందిన 42 టీంలు పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్ పోటీలో సంగారెడ్డి జిల్లా వెంకటాపూర్ క్రికెట్ టీం విజేతగా నిలిచింది. మర్పల్లి గ్రామానికి చెందిన క్రికెట్ టీం రన్నర్‌గా నిలిచారు. విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరక్టర్ ప్రభాకర్‌గుప్తా, ఎంపీటీసీ సంగీత, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు తదితరులు ఉన్నారు.

గడ్డం శైలజ జ్ఞాపకార్థం..

మర్పల్లి: ప్రతి యువకుడు క్రీడలపై దృష్టి సారించాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుకుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొంషేట్‌పల్లిలో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ సతీమణి గడ్డం శైలజ జ్ఞాపకార్థం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ప్రసాద్‌కుమార్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. విన్నర్‌గా నిలిచిన సంగారెడ్డి జిల్లా కొండాపూర్ కబడ్డీ జట్టుకు రూ 33,333 అందజేశారు.

కఠినచర్యలు తీసుకుంటాం

ఎస్పీ కోటిరెడ్డి



అనంతగిరి: కులాలు, మతాల మధ్య ఎవరైనా చిచ్చు పెడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలకు ఆటంకం కలిగే విధంగా ప్రవర్తించినా ఉపేక్షించేదిలేదన్నారు. ప్రజలందరూ తమ కుల, మతాలను గౌరవించాలన్నారు. జిల్లాలో ఏదైన అవాంఛనీయమైన సంఘటనలు జరిగినపుడు పోలీసు అధికారులకు సమాచారాన్ని అందించాలన్నారు. ఏ చిన్న సంఘటనలు చోటుచేసుకున్నా డయల్ 100కు గాని సమాచారం అందించాలన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

తాండూరు టౌన్ : రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు తాండూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాండూరు – రుక్మాపూర్ స్టేషన్ల మధ్య గురువారం మధ్యాహ్నం ఓ వ్యక్తి రైలు నుంచి జారిపడినట్లు అనుమానిస్తున్నామన్నారు. వ్యక్తి వయసు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉంటుందని, గోధుమ, తెలుపు రంగు గల ఫుల్ స్వెటర్, బూడిద రంగు జీన్స్ ప్యాంటు వేసుకుని ఉన్నట్లు తెలిపారు. ఈమేరకు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఆయన తెలిపారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన కేంద్ర బృందం

కొడంగల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కేంద్ర బృందం గురువారం సందర్శించింది. కళాశాలలో తరగతుల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, కంప్యూటర్ విద్య తదితర అంశాలను సభ్యులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఐదేళ్లకు ఒకసారి కేంద్ర బృందం వచ్చి కళాశాలలను తనిఖీ చేసి నివేదికను ప్రభుత్వానికి ఇస్తారు. ఇందులో భాగంగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ సిబ్‌నాథ్ చైర్మన్‌గా కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆయన సారథ్యంలో కేరళ రాష్ట్రానికి చెందిన ప్రిన్సిపాల్ డాక్టర్ యాకూబ్, యూనివర్సిటీ డీన్ డాక్టర్ సునీల్ మోరే సభ్యులుగా ఉన్నారు. వారు కొడంగల్‌కు వచ్చి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పరిశీలించారు. అన్ని విషయాలను తనిఖీ చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు. రెండు రోజు పాటు విచారణ జరుగుతుంది. వీరి నివేదిక ఆధారంగా కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. వీరితో పాటు రాష్ట్ర ఉన్నత విద్యా విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డీఎస్‌ఆర్ రాజేందర్ సింగ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజారాం ఉన్నారు.

తాండూరు విద్యార్థుల ప్రతిభ

తాండూరు: పట్టణ విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనల్లో రాణించి జాతీయ స్థాయి ప్రదర్శనకు అర్హత సాధించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు నియోజకవర్గ స్థాయి నుంచి జాతీయ స్థాయి వైజ్ఞానిక పోటీలను నిర్వహించింది. తాండూరు అక్షర స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు సందీప్, అనిరుధ్‌లు ఉపాధ్యాయుడు రవికుమార్ ఆధ్వర్యంలో ఫోన్ మైక్రోస్కోప్ తయారు చేసి ప్రదర్శించారు. ఇటీవల కేరళ రాష్ట్రంలో దక్షిణ భారత దేశ వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో సెల్ ఫోన్ మైక్రోస్కోప్ తయారు విధానాన్ని వైజ్ఞానిక ప్రదర్శనలో ఉంచారు. ఈ పోటీలలో తాండూరు విద్యార్థులు అవార్డు సాధించారు. ఈ ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.

అంగన్‌వాడీ టీచర్, ఆయాలపై ఫిర్యాదు

ధారూరు: సమయపాలన పాటించని అంగన్‌వాడీ టీచర్, ఆయాలపై ఎబ్బనూర్ సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉన్నా.. ఉదయం 10.30 గంటలకే కేంద్రానికి తాళం వేసి వెళ్తున్నారన్నారు. చిన్నారులను సైతం అక్కడే వదిలి వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని సర్పంచ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇష్టానుసారంగా విధులు నిర్వహించడం, విధులకు రాకున్నా హాజరైనట్లు సంతకాలు చేస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు తగిన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అన్ని చోట్లా విజయం సాధిస్తాం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మెతుకు ఆనంద్

- రాష్ట్రంలో ఎదురులేని నేత కేసీఆర్
- సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలి
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్


హాజరైన కార్యకర్తలు

కొడంగల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఎదురులేని నేత అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. గురువారం పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాలులో నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి మెతుకు ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పార్టీ జెండాను ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ విజయం ఖాయమని పేర్కొన్నారు. వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని నియమించాలని పార్టీ బాధ్యులకు సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టారని కొనియాడారు. అన్ని సామాజిక వర్గాలకు మేలు జరిగిందన్నారు. పార్టీకి కార్యకర్తలే కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుల మాదిరి పని చేయాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు భవిష్యత్తు లేదన్నారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆసరా ఫించన్లు, రైతు బంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రుణ మాఫీ, ఉచిత కరెంటు, మిషన్ భగీరథ, కేసీఆర్ కిట్టు, కంటి వెలుగులాంటి ఎన్నో పథకాలను ముఖ్యమంత్రి ప్రవేశపెట్టి పేదలను ఆదుకుంటున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల, దౌల్తాబాద్ మండల నాయకులు మాట్లాడారు. 24 గంటలు ప్రజల మధ్యన ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నరేందర్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

కుల్కచర్ల: ఉద్యోగం ఇప్పించడంతో పాటు పెళ్లి చేసుకుంటానని గిరిజన బాలిక (18)ను నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. చౌడాపూర్ మండలం చాకల్‌పల్లికి చెందిన సత్యనారాయణ హన్వాడ మండలానికి చెందిన ఒక గిరిజన బాలికకు ఉద్యోగం ఇప్పిస్తానని, పెళ్లి చేసుకుంటానని మోసం చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.